అనుమతి లేని లేఅవుట్లపై కొరడా

- 70 శాతం వైసీపీ నేతలవే
- పరిశీలనకు ముగ్గురితో కమిటీ
- మోసపోయిన కొనుగోలుదారులు

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ నేతల నిర్వాకం కారణంగా అన్ని శాఖలు చేష్టలుడిగిపోయాయి. ప్రభుత్వ నిబంధనలు పక్కనబెట్టి కొందరు అధికారులు వైసీపీ నేతలు చెప్పిన నిబంధనలే అమలు చేశారు. అయితే చివరికి నష్టపోయేది మాత్రం జనం మాత్రమే. ఐదేళ్ల పాలనలో అధికారం అడ్డుపెట్టుకుని అనుమతి లేకుండా కొందరు వైసీపీ నేతలు లే అవుట్లు వేశారు. అవి తెలియక జనం కొనుగోలు చేశారు. ఇప్పుడు అనుమతిలేని లే అవుట్లలో పరిశీలన కోసం ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. లేఅవుట్లపై వచ్చిన ఫిర్యాదులపై ఈ కమిటీ ఇప్పుడు పరిశీలన చేయనుంది. ఇది ఇప్పుడు కొందరు వైసీపీ నేతల్లో అలజడి రేపుతుంది.

ఇష్టారాజ్యంగా లేఅవుట్లు

తమ ప్రభుత్వమే శాశ్వతంగా ఉంటుంది.. మాకు నిబంధనలు ఏంటని కొందరు వైసీపీ నేతలు అనుకున్నారు. అనుమతులు లేకుండా, కనీస నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా లే అవుట్లు వేశారు. కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ పరిధిలో కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు, పులివెందుల, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కమలాపురం నగర పంచాయతీతో పాటు జిల్లాలో అర్బన్ అథారిటీ ఉంది. ఈ పరిధిలో లేఅవుట్లు వేయాలంటే టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం వేయాల్సి ఉంది. అయితే కొందరు వైసీపీ నేతలు అడ్డగోలుగా వ్యవహరించారు. అర్బన్ డెవలప్‌మెంటు పరిధిలో 234 అనుమతి లేని లేఅవుట్లు ఉన్నాయి.

నిబంధనలకు నీళ్లు

టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం లే అవుట్ వేయాలంటే 40 అడుగుల రోడ్లు, పది శాతం ఓపెన్ స్పేస్, వాటర్‌ట్యాంకు, ఇతర వాటికోసం 3 శాతం స్థలాన్ని కేటాయించాలి. ఇక అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. వ్యవసాయ భూమి అయితే దాన్ని ల్యాండ్ కన్వర్షన్ ద్వారా వ్యవసాయేతర భూమిగా మార్చుకుని ఫీజులు చెల్లించాలి. అయితే జిల్లాలో కొందరు వైసీపీ నేతలు మాత్రం నిబంధనలకు మంగళం పలికారు. ముఖ్యంగా కడప నగరంలో కొందరు వైసీపీ నేతలు, కార్పొరేటర్లు, రియల్టర్ల అవతారం ఎత్తారు. ఇక్కడ వేసిన లేఅవుట్లలో 70 శాతం వైసీపీ నేతలే ఉంటారు. అందుకే వీరిలోచాలావరకు నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్లు వేశారు.

రామకృష్ణనగర్‌లో ఓ వైసీపీ నేత వేసిన అనుమతి లేని లేఅవుట్లు



ప్రస్తుతం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగైంది. సొంత ఇంటిని నిర్మించుకోవాలని ప్రతిఒక్కరూ కలగంటున్నారు. బ్యాంకు రుణాలు ఇవ్వడం, ఉద్యోగం చేసినప్పుడు కాస్త పొదుపు చేసుకున్న సొమ్ముతో ఇల్లు కట్టుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. సిటీలో అయితే రేటు ఎక్కువ ఉండడంతో కాస్త శివారు ప్రాంతమైనా సరే కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కడప నగరం చుట్టూ పుట్టగొడుగుల్లా లేఅవుట్లు వెలిశాయి. చాలావరకు వైసీపీ కీలక నేతలవే ఉండడం, కాస్త ధర తక్కువగా ఉండడంతో అవి అనుమతులు ఉన్నాయా లేదా చూడకుండా కొనుగోలు చేశారు. ఇప్పుడు ఇల్లు కట్టుకునేందుకు అనుమతి కోసం కార్పొరేషన్‌కు వెళితే అసలు గుట్టురట్టు అవుతుంది. ఆ లేఅవుట్లలో 30 అడుగులలోపే రోడ్లు ఉండడం, సరైన వసతులు లేకపోవడంతో నిబంధనల రోడ్ల కోసం కమిషనరు పేరిట గిఫ్ట్ డీడ్ చేయడం, ఇక ఓపెన్‌స్పేస్ లేకపోవడంతో 14 శాతం పెనాల్టీ, ఇక మిగతా చార్జీలపై 33 శాతం పెనాల్టీ కట్టాల్సి వస్తోంది. ఏదో ధర తక్కువ అని కొనుగోలు చేస్తే ఇలా జరిగిందేంటి అని ఆశ్చర్యానికి గురవడం కొనుగోలుదారుల వంతైంది. బిల్టప్ వద్ద ఓ వైసీపీ నేత బంధువు కేసీ కెనాల్ రోడ్డును లే అవుట్ స్థలంగా చూపించి ప్లాట్లు అమ్మేసినట్లు చెబుతారు. ఇలా వాగులు, వంకలు, స్థలాలను కూడా ఆక్రమించేసి లేఅవుట్లు వేసి అమ్మేశారు.

కమిటీ విచారణ

కడపలో అనుమతి లేని లేఅవుట్లు విచ్చలవిడిగా ఉన్నాయంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంటు పరిధిలో అనుమతి లేని లేఅవుట్లపై విచారణకు మంత్రి నారాయణ ఆదేశించారు. కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ అనుమతిలేని లేఅవుట్లపై కూడా అనుమతి వచ్చింది. 2019 నుంచి 2024 మధ్య అనుమతి లేని లేఅవుట్లపై విచారణ సాగనుంది. ఈ మేరకు కె.నాగసుందరి, డి.రాంబాబు, మధుకర్‌లతో కూడుకున్న కమిటీని నియమిస్తూ ఈ నెల 11న ప్రభుత్వం మున్సిపల్ పరిపాలన విభాగం జీవోఆర్‌టీ నెం.490ని జారీ చేసింది. కొందరు వైసీపీ నేతల అబద్ధపు మాటలు నమ్మి కొనుగోలు చేసిన వారికి కమిటీ విచారణతో ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాలు

- భక్తిశ్రద్ధలతో అంకురార్పణ

నందలూరు, జూలై 13: మహావిష్ణువు స్వరూపుడైన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జగద్రక్షకుడైన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయని తెలపడానికి అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు జరిగే ఏర్పాట్లను శ్రీవారి తరపున ఆయన సర్వసైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడు వారు సమీక్షించే కార్యక్రమాన్ని అంకురార్పణ అంటారు. అంకురార్పణకు నవధాన్యాలు, కలశ స్థాపనలు, పూర్ణకుంభ ప్రతిష్ఠ, పుణ్యాహవచనాలకు బియ్యం, నెయ్యి, బెల్లం, టెంకాయలు, తమలపాకులు సమకూర్చారు. బ్రహ్మోత్సవాలకు అర్చక స్వాములు సునీల్‌కుమార్ బృందంతో కలశ స్థాపన చేసి హోమం నిర్వహించారు. ఆలయ ఆగ్నేయ మూలలో వెలసి ఉన్న పుట్ట వద్ద పలుగు, పారలకు, పుట్టకు పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా గురు దేవతను లిఖించి ఆహ్వానించారు. పూజాది కార్యక్రమాలను పూర్తి చేసి లిఖించిన భూదేవత నుంచి కొంత పుట్ట బంగారం సేకరించి అంకురార్పణ మండపంలో ఏర్పాటు చేసిన 12 పాలికలలో పుట్ట బంగారం నుంచి అందులో నవధాన్యాలు చల్లి అంకురింపజేసే కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మూలవరులకు, ఉత్సవ వరులకు తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ రీజనల్ ఛైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం, టీడీపీ సీనియర్ నాయకులు గంటా వాసుదేవయ్య, జంగంశెట్టి వెంకటసుబ్బయ్య, చక్రాల రామసుబ్బన్న, మోడపోతుల రాము, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

నందలూరులో సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ధ్వజారోహణం, తిరుమంజనం, రాత్రికి యాలి వాహనంపై సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.



అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉద్యానానికి ఊతం



సాగులో ఉన్న ఉద్యాన పంటలు

ఉద్యాన సమగ్రాభివృద్ధి పథకం

- రూ.6.69 కోట్లతో ప్రణాళికలు సిద్ధం

కడప(ఎన్టీఆర్ సర్కిల్), జూలై 13: జిల్లాలో ఉద్యానపంటల సాగుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వివిధ రకాల పంటలకు సాగు విస్తీర్ణం మరింత పెంచడంతో పాటు పాత తోటలను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే జిల్లాలో చీనీ, అరటి, మామిడి, నిమ్మ, బొప్పాయి, పసుపు, కేపీ ఉల్లి, టమోటా, కర్బూజాతో పాటు కూరగాయలు, తమలపాకుల సాగు 64,288 వేల హెక్టార్లలో సాగు చేయనున్నారు. ప్రతి సంవత్సరం 16.92 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తులు జిల్లాలో అందుబాటులోకి వస్తున్నాయి. ఈ క్రమంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యానపంటల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఉద్యాన సమగ్రాభివృద్ధి పథకం ద్వారా రూ.6.69 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించారు. ఇందులో ప్రధానంగా 800 హెక్టార్లలో రూ.కోటి 39 లక్షల అంచనా వ్యయంతో ముదురుతోటల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. పండ్లతోటల అభివృద్ధి పథకం కింద 582.70 హెక్టార్లలో 63 లక్షలతో అభివృద్ధి చేపట్టనున్నారు. హైబ్రిడ్ కూరగాయల ఉత్పత్తి కోసం 187 హెక్టార్లలో రూ.37.40 లక్షలు ఖర్చు చేసి కూరగాయల ఉత్పత్తిని మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లాలో చామంతి సాగు అధికంగా ఉంటుంది. కొన్ని మండలాల్లో మల్లె తోటలు కూడా రైతాంగానికి ఆదరవుగా నిలుస్తున్నాయి. ఇందుకోసం 209 హెక్టార్లలో రూ.33.44 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేయనున్నారు. అదే విధంగా రెండో సంవత్సరం సాగులో ఉన్న పండ్ల తోటల నిర్వహణ కోసం రూ.23.47 లక్షల వ్యయంతో 695 హెక్టార్లలో అభివృద్ధి పనులు చేయనున్నారు. మూడో సంవత్సరం పండ్లతోటల నిర్వహణ పథకం కింద 278.39 హెక్టార్లలో తోటల అభివృద్ధి కోసం రూ.10.50 లక్షలు ఖర్చు చేయనున్నారు.

నీటి కుంటలు ఏర్పాటు

వర్షాభావ పరిస్థితులతో పాటు తోటలకు అనునిత్యం నీటిని అందించేందుకు ఉద్యాన తోటల మధ్యనే నీటి కుంటలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. రూ.కోటి 2లక్షల వ్యయంతో 33 కుంటలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. రూ.47 లక్షల వ్యయంతో రక్షిత సేద్యం, షెడ్ నెట్ హౌస్‌ల ఏర్పాటు, ప్లాస్టిక్ మల్చింగ్ పద్ధతులను 294 హెక్టార్లలో చేపట్టనున్నారు. అదేవిధంగా ఉద్యాన పంటల సాగులో మార్కెటింగ్‌కు ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ముఖ్యంగా ఉంటుంది. మార్కెటింగ్‌కు వెళ్లే ముందే ఉత్పత్తులను గ్రేడింగ్ చేసేందుకు కోత అనంతరం యాజమాన్య పథకం కింద 80 ప్రాంతాల్లో రూ.కోటి 60 లక్షలతో పనులు చేపట్టనున్నారు. ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా రూ.15.50 లక్షలతో 110 యంత్రాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

పరిహారం కోసం దస్త్రం

ఈ ఏడాది మే, జూన్ నెలల్లో వీచిన అధిక గాలులు, వర్షాల వల్ల జిల్లాలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అధికార యంత్రాంగం నష్టం అంచనాలను నివేదిక రూపంలో తయారుచేసింది. దాదాపు 484.38 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు అధికారులు అంచనాలు రూపొందించారు. సుమారు 589 మంది రైతులు ఒక కోటి 21 లక్షలు నష్టపోయారని, వీరికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం సాయం అందించాలని జిల్లా ఉద్యాన అధికారి నివేదిక తయారు చేసి కలెక్టరుకు అందించారు.



రసవత్తరంగా హాకీ పోటీలు



ఆంధ్రప్రదేశ్-కేరళ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారిణిలు

పులివెందుల రూరల్, జూలై 13: పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 2వ సౌత్‌జోన్ జూనియర్ చాంపియన్‌షిప్-2024 పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పోటీలలో జూనియర్ ఉమెన్స్ విభాగంలో కేరళ-పాండిచ్చేరి జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా 10గోల్స్ వేసి కేరళ జట్టు విజయం సాధించింది. తమిళనాడు-తెలంగాణ జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా 9 గోల్స్ వేసిన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్-కేరళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 11గోల్స్ వేసిన ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. అలాగే మెన్స్ విభాగంలో తెలంగాణ-కర్ణాటక మధ్య జరగ్గా 2గోల్స్ వేసిన తెలంగాణ, తమిళనాడు-కేరళ మధ్య జరగ్గా 6 గోల్స్ వేసిన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్-పాండిచ్చేరి మధ్య జరగ్గా 5 గోల్స్ వేసిన ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బీఎం చాణిక్యరాజ్ తెలిపారు.

మోదీ ప్రభుత్వ ప్రకటన హాస్యాస్పదం : తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 13: ప్రధాని మోదీ ప్రభుత్వం జూన్ 25ను రాజ్యాంగ హత్యాదినంగా గెజిట్‌లో ప్రకటించడం హాస్యాస్పదమని మాజీ రాజ్యసభ సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ వైఖరి దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. బయట నుంచి కానీ, లేదా అంతర్గతంగా కానీ దేశభద్రత, సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి ప్రమాదం పొంచి ఉన్నప్పుడు దేశంలో ఎమర్జెన్సీని విధించవచ్చని రాజ్యాంగంలో ఆర్టికల్ 352లో స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఆర్టికల్ ప్రకారం 1962 చైనా దురాక్రమణ సందర్భంగా, 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం కారణంగా దేశంలో ఎమర్జెన్సీని విధించినట్లు తెలిపారు. పరిస్థితులు చక్కబడ్డాక ఎమర్జెన్సీ ఎత్తివేయడం జరిగిందన్నారు. కాగా మోదీ పాలనలో గత పదేళ్లుగా దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతుందని తెలిపారు.

ఎస్పీగా హర్షవర్ధన్ రాజు



వి.హర్షవర్ధన్‌రాజు

(కడప- ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా వి.హర్షవర్ధన్‌రాజును నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2013 బ్యాచ్‌కు చెందిన ఈయన అన్నమయ్య జిల్లాలో పనిచేశారు. ప్రస్తుతం తిరుపతి ఎస్పీగా పనిచేస్తున్న ఈయనను కడప ఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత ఎస్పీగా సిద్దార్థ కౌశల్ 2023 నవంబరు 9న బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో దాదాపు తొమ్మిది నెలలుగా విధులు నిర్వహించారు. కౌశల్ హయాంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అయితే మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని అరెస్టు చేసిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఈయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు వచ్చాయి. ఇక హర్షవర్ధన్‌రాజుకు ముక్కుసూటి అధికారిగా పేరుంది. అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేసినప్పుడు పెద్దిరెడ్డి అండ్‌కో గ్యాంగ్ మాట వినకుండా నిక్కచ్చిగా వ్యవహరించారంటారు. అందుకే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేశారంటారు. తిరుపతి ఎస్పీగా ఈసీ ఆదేశాల మేరకు మే 19న జాయిన్ అయ్యారు. అంటే ఆయన కనీసం రెండు నెలలు కూడా అక్కడ విధులు నిర్వహించలేదు. రాయలసీమలోనే పెద్ద సిటీగా పేరున్న తిరుపతిలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్‌ను చక్కదిద్దారంటారు. క్రైమ్ రేటును తగ్గించేందుకు తన పరిధిలో తక్కువ టైంలో చేశారంటారు. తిరుపతిలో బహిరంగ మద్యం సేవిస్తున్న వారిని తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇక పోలీసు సంక్షేమం కోసం పాటుపడ్డారు. కడప.. స్టేట్‌లోనే ఒక ప్రత్యేకమైన జిల్లా. వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి సొంత జిల్లా కడప కావడంతో ఇక్కడ శాంతిభద్రతల పరంగా ఏ చిన్న ఇష్యూ జరిగినా రాష్ట్రంలోనే సంచలనంగా మారుతుంది. జగన్ పాలనలో కడప జిల్లా పోలీసు వ్యవస్థ అంతా కేవలం పులివెందుల పవర్‌కు బానిసలయ్యారన్న విమర్శ ఉంది. జనం కోసం పాటుపడలేదని విమర్శ ఉంది. ఓ విధంగా చెప్పాలంటే కడప జిల్లా పోలీసు అంటే పులివెందుల వైసీపీ నేతలనే భావన ఉండేది. వైసీపీ బ్యాచ్ కూడా కొందరు పోలీసులను చులకనగా చూస్తారంటారు. ప్రభుత్వం కూడా కడప జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టి హర్షవర్ధన్‌రాజును నియమించారంటారు.

స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తాం

- నందం సుబ్బయ్య హత్య ఎవరు చేశారో ప్రజలందరికి తెలుసు
- చుక్కల భూములు, భూ దోపిడీపై విచారణ జరుపుతాం
- ప్రొద్దుటూరును బెట్టింగ్ అడ్డాగా మార్చారు
- ఓ ఎస్పీ జిల్లాను దందాలు, ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అడ్డాగా మార్చారు
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌నాయుడు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి రాష్ట్ర విభజన హామీ అయిన కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌నాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు నచ్చే విధంగా ప్రజాపాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. జగన్ పాలన లాగా తమ పాలన ఉండదని దౌర్జన్యాలు, కక్షసాధింపులు, ప్రతీకార చర్యలు అసలే ఉండవన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించవచ్చని, ఏదైనా తప్పు జరిగితే తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హరికిరణ్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు చక్రాయపేట జడ్పీటీసీ సభ్యుడు కలెక్టర్ కార్యాలయంలో దుకాణం పెట్టి 22ఎ, చుక్కల భూముల పేరుతో దోపిడీ చేశారని విమర్శించారు. కమలాపురం, కడపలో పెద్ద ఎత్తున భూదోపిడీ జరిగిందని, వీటన్నింటిపై విచారణ జరిపిస్తామని తెలిపారు. జిల్లాలో మొదటిసారిగా ఏఎస్పీగా, ఎస్పీగా ఉద్యోగం పొందిన ఓ అధికారి జిల్లాను దందాలు, ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అడ్డాగా మార్చారని ఆరోపించారు. నందం సుబ్బయ్య హత్య ఎవరు చేశారో ప్రజలందరికీ తెలుసునని, నిందితులను పోలీసులు కాపాడుతున్నారని, వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పూర్వం నుంచి ప్రొద్దుటూరు ఆర్థికంగా బలోపేతమైనా, బంగారు వ్యాపారంలో రెండవ బాంబేగా పేరుగాంచిందన్నారు. కానీ ప్రొద్దుటూరు పట్టణాన్ని వైసీపీ నాయకులు నాశనం చేశారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ప్రొద్దుటూరును గుట్కా, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌కు అడ్డాగా మార్చారని, ప్రొద్దుటూరులో ఇళ్లు కట్టుకోవాలన్నా మాజీ ఎమ్మెల్యే బావమర్ది బంగారురెడ్డికి కప్పం కట్టాల్సిన పరిస్థితి ఏర్పర్చారని ఆరోపించారు. పట్టణంలో అక్రమ లేఅవుట్లపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు చాలా మందిని బెదిరించి స్థలాలను లాక్కున్నారని, వారు తమ దృష్టికి తెస్తే ప్రభుత్వానికి తెలియజేసి న్యాయం చేస్తామన్నారు. అలాగే బలవంతంగా డబ్బులు వసూలు చేసిన సంఘటనలు ఉన్నాయని, ఫిర్యాదు చేస్తే వెనక్కు ఇప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పాలన పడకేసిందని, ఎక్కడా శుభ్రత లేదని, దోమలు విజృంభిస్తున్నాయని విమర్శించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పెన్నానది ఉన్నందున త్వరలో ఇసుక ర్యాంపు వస్తుందని, ఎక్కువ డబ్బులు పెట్టి ఇసుక కొనాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అయిదు అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించిందని, షర్మిల లేకపోతే ఎంపీ స్థానం కూడా గెలిచేవారమన్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి దందాలు, వివేకానందరెడ్డి హత్యతో జిల్లాను భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాలను అమలు చేయాలని పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సీఎం రమేశ్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీ సీఎం రమేశ్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

కోదండరాముని దర్శించుకున్న ఎంపీ సీఎం రమేశ్

ఒంటిమిట్ట, జూలై 13: ఏకశిలానగరి కోదండరాముడిని అనకాపల్లె ఎంపీ సీఎం రమేశ్ శనివారం సాయంత్రం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ముందుగా టీడీపీ నాయకుడు కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో కోదండరామాలయం వెనుకభాగం నుంచి స్వాగతం పలికి స్వామివారి దర్శనానికి ర్యాలీగా తీసుకెళ్లారు. టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, ఇన్‌స్పెక్టర్ నవీన్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనానికి తీసుకెళ్లారు. మూలవిరాట్ అయిన సీతారామ లక్ష్మణులను దర్శించుకున్నారు. అనంతరం రంగమండపంలో ఆలయ చరిత్ర, శిలా సంపద, ఆలయ విశిష్టతను తెలుసుకుని వేదపండితుల ఆశీర్వాదం స్వీకరించారు. అనంతరం వీరికి పెద్దఎత్తున టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, రాజంపేట మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ మల్లేల శ్రీవాణి, మాజీ ఎంపీపీ ఓబినేని సుబ్బమ్మ, న్యాయవాది రామ్‌దాస్, పామూరు సుబ్రమణ్యం, రేవిళ్ల బాలమునెయ్య, మావిళ్ల ఈశ్వరయ్య, డాక్టర్ శివ, మావిళ్ల శ్రీహరి, బీజేపీ నాయకులు పాటూరు గంగిరెడ్డి, బాలరాజు శివరాజు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బేబి హాస్పిటల్‌లో అత్యాధునిక కీళ్లమార్పిడి శస్త్రచికిత్స

కడప(సెవెన్‌రోడ్స్), జూలై 13: జేబి హాస్పిటల్‌లో అత్యాధునిక కీళ్లమార్పిడి శస్త్రచికిత్స చేస్తున్నట్లు ప్రముఖ కీళ్ల మార్పిడి, కీహోల్ సర్జన్ డాక్టర్ జహంగీర్‌బాషా పేర్కొన్నారు. శనివారం కడపలోని జేబీ హాస్పిటల్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరప్ దేశమైన స్పెయిన్‌లో ఏఓ సంస్థ తనకు ఆహ్వానం పలికి అందులో ట్రైనింగ్ ఇప్పించి ప్రావీణ్యం పొందేలా చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. అక్కడున్న పరికరాలు, పద్ధతులు భారతదేశంలో అతి తక్కువ ఆసుపత్రిలో మాత్రమే లభిస్తాయని, అటువంటి పద్ధతులు, చికిత్సలు ఇప్పుడు జేబి హాస్పిటల్‌లో ప్రారంభించామన్నారు. ముఖ్యంగా రివిజన్, ప్రైమరీ కీళ్ల మార్పిడిలో అతి తక్కువ ఎముకను కట్ చేయడం, తక్కువ రక్తస్రావం, తక్కువ ఇన్‌ఫెక్షన్ రేటు ఫాస్ట్ రికవరీ ఉంటుం దన్నారు. ఈ ఆపరేషన్లు తమ వద్ద ఉన్న జాన్సన్ అండ్ జాన్సన్ వారి రోబో ద్వారా సాధ్యపడుతుందన్నారు. ఇప్పటికే ఆ పద్ధతి ద్వారా 1వ తేది నుంచి ఇప్పటి వరకు 20 మందికి కీళ్ల మార్పిడి ఆపరేషన్ చేసి విజయవంతంగా నడిపించడం తమకు సంతోషంగా ఉందని మత్తుమందు డాక్టర్, హాస్పిటల్ సీఈఓ డాక్టర్ జయభారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జహంగీర్‌బాషా, చిత్రంలో డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ వెంకటేశ్వర్లు

నాగుపాముకు వైద్యం చేసిన డీడీ రంగస్వామి



నాగుపాముకు వైద్యం చేస్తున్న డాక్టర్ రంగస్వామి

కడప(రూరల్) జూలై 13: బహుళార్థ పశువైద్యశాలలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రంగస్వామి నాగుపాముకు వైద్యం చేశారు. నాగుపాము కడుపునకు పదునైన ఇనుప వస్తువు తగిలి పేగులు బయటికి వచ్చాయి. విషయం తెలుసుకున్న స్నేక్ క్యాచర్ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. దీంతో డీడీ పేగులను తిరిగి పొట్టలోకి పంపించి కుట్లువేశారన్నారు. ఏడీలు చాంద్ బాషా, నేతాజీ, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ నంద్యాల రాజశేఖర్, డాక్టర్ సుబ్బరాయుడు, వీఏఎస్‌లు శివలక్ష్మి, వీఎల్ఓ షాహిదా బేగం తదితరులు వైద్యం చేయడంలో సహాయం అందించారన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై వేడి నూనెతో దాడి

ఒంటిమిట్ట, జూలై 13: పెన్నపేరూరులో కదిరి ప్రభాకర్‌పై అదే గ్రామానికి చెందిన గజ్జల సుబ్బారెడ్డి వేడి నూనె పోసి దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు పక్క ఊరిలోని ప్రభాకర్ బంధువు చనిపోతే అంత్యక్రియలకు వెళ్లాడు. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు గ్రామంలోని ఓ ఇంటి అరుగుమీద పడుకుని ఉండగా ఆ ఇంటివారు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పగా ఆయన వెళ్లలేదు. దీంతో వారు వేడివేడి నూనెను వేయడంతో వెళ్లిపోయాడు. ఇంటికి వెళ్లి ఉదయం చూస్తే శరీరంపై బొబ్బలు రావడంతో కుటుంబ సభ్యులకు తెలపగా చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడిన కదిరి ప్రభాకర్ ఎస్సీ సామాజిక వర్గీయుడు కావడంతో పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి, సీఐ పురుషోత్తమరాజు ఆధ్వర్యంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయి

ఆర్టీసీ జోన్-4 ఉద్యోగుల క్రీడల ప్రారంభోత్సవంలో ఈడీ



నడక పోటీల్లో ఆర్టీసీ ఈడీ, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్

కడప (స్పోర్ట్స్) జూలై 13: ఉద్యోగుల మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. నిత్యం ఆఫీసులో ఫైళ్లతో తలమునకలౌతూ సేవలందించే ఉద్యోగులకు క్రీడలు కాసింత సేద తీర్చగలిగే ఉత్సాహాన్ని ఇవ్వగలవన్నారు. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్‌టీయూ) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సారథ్యంలో శనివారం రిమ్స్ సమీప స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో ఆల్ ఇండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మీట్ (మహిళలు-పురుషులు) క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా వెంకటేశ్వరరావు, కడప ఆర్టీసీ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. ఉద్యోగుల దైనందిన జీవితం కత్తిమీద సాములా వుంటుందన్నారు. వారంతంలో అయినా కాసింత ఆటవిడుపు కోసం ఉద్యోగులు తేలికపాటి క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తద్వారా ఆరోగ్యం, ఆయుష్షు పొందగలరన్నారు. తదనంతరం జోన్-4 (కడప-కర్నూలు-చిత్తూరు-అనంతపురం) జిల్లాల నుంచి హాజరైన 164 మంది ఆర్టీసీ ఉద్యోగులకు 100, 400, 800, 1500 మీటర్స్ (పురుషులకు) పరుగుపందెం పోటీలు, 400 మీటర్స్ నడక (50 సంవత్సరాలు పైబడిన ఆఫీసర్స్‌కు) పోటీలు, ఇందులో కడప ఆర్టీసీ ఏరియా హాస్పిటల్ సూపరింటెండ్ శ్రీకాంత్ ప్రథమరెడ్డి ప్రథమ విజేతగా, ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి. గోపాల్‌రెడ్డి ద్వితీయ విజేతగా నిలిచారు. జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్ తదితర పోటీల్లో పలువురు మహిళా-పురుష ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ సీపీఎం గజలక్ష్మి, డిప్యూటీ సీటీఎం హరి, కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి, ఉద్యోగులు గోరవర్ధన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు, పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బిడ్డలకు అండగా ఉంటాము : ఎమ్మెల్యే

- ఆరు లక్షల రూపాయలు పిల్లల పేర డిపాజిట్



ఎమ్మెల్యే పుట్టా నుంచి బాండ్లు ఇస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి స్పందన

మైదుకూరు రూరల్ జూలై 13: తల్లిదండ్రులు ఇద్దరూ ఒకే నెలలో మృతి చెందడంతో అనాథలుగా మారిన చిన్నారులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రకటించారు. టీడీపీ యువనేత, న్యాయవాది యాపరాల చిన్న, శ్రీనివాసులు(వాసు) పిల్లల భవిష్యత్‌ను బాధ్యతగా తీసుకుని వచ్చిన డబ్బును పిల్లలకు ఆరు లక్షల రూపాయలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఎమ్మెల్యే ద్వారా వారి మేనత్తకు అందించారు. పాతూరులో యాంగటి రమాదేవి జూన్ 15వ తేదీన బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించింది. ఆమె భర్త యాగంటి ఈశ్వర్ గుండెనొప్పితో మరణించాడు. ఒకే నెలలో తల్లిదండ్రులను కోల్పోయి వారి ముగ్గురు పిల్లలు అనాథలవడంతో పాతూ రంతా చలించింది. ఈ హృదయ విదారక సంఘటనను ఆంధ్రజ్యోతిలో 'మేమేం పాపం చేశాం..' అంటూ కథనం ప్రచురితమైంది. దీంతో దాతలు వెల్లువలా పిల్లల భవిష్యత్‌కు డబ్బును విరాళాలుగా ఇచ్చారు. 8వ తరగతి చదువుతున్న వాసంతికి కస్తూర్బా స్కూల్‌లో ఎమ్మెల్యే సీటు ఇప్పించారు. పిల్లల ఆలనాపాలన చూసే మేనత్తకు ఉద్యోగం ఇప్పిస్తానని మాట ఇచ్చారు. పిల్లల విషయంలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నా దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

సమస్యల వలయాలు

శిథిలావస్థలో విద్యుత్ భవనాలు ● పెచ్చులూడిన పైకప్పు ● నెర్రలు చీలిన గోడలు ● ఇబ్బందుల్లో సిబ్బంది ● మున్సిపాలిటీ బకాయి రూ.1.93 కోట్లు

జమ్మలమడుగు, జూలై 13: స్థానిక విద్యుత్తు సబ్ డివిజన్ కార్యాలయం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఆవరణంలోకి వెళ్లేందుకు గేటు మొదలు గుంతల మయమైన రోడ్డుతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారాయి. సబ్‌డివిజన్ కార్యాలయం మాత్రం అంతంత మాత్రమే. దాని పక్కనే సిబ్బంది, బిల్లులు చెల్లింపు గదులు దారుణంగా తయారయ్యాయి. పైకప్పులు పెచ్చులూడడంతో కడ్డీలు దర్శనమిస్తున్నాయి. విద్యుత్తు భవనాలు పడిపోయే దిశలో ఉన్నట్లు సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నా కార్యాలయ భవనాలు మాత్రం నిర్మించలేకున్నారు. సమస్య ఉన్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి. విద్యుత్తు సామగ్రిపెట్టుకునే గదులు మరింత దారుణంగా మారాయి. కొద్దిపాటి వర్షం కురిసినా కార్యాలయ ఆవరణలోకి పైకప్పుగుండా వర్షపునీరు చేరుతోంది. ఆవరణలో వ్యర్థాలతో నిండి అపరిశుభ్రంగా మారింది.

బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నారు

జమ్మలమడుగులో విద్యుత్తు వినియోగదారులు చేనేత కార్మికులు, ఇతర వ్యాపారులు విద్యుత్తు బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. బిల్లులు చెల్లించే గది వద్ద వినియోగదారులు క్యూకట్టారు. వినియోగదారులకు మంచినీటి వసతి కల్పించాల్సి ఉంది. అధికారులు విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని పట్టణంలోని బీసీ కాలనీలో తాడిపత్రి రోడ్డులోని మరికొందరు కార్యాలయంలోని అధికారులు సంప్రదించి బిల్లులు అధికంగా వచ్చాయని తెలియజేశారు. ఇదే విషయాన్ని విద్యుత్తు డీఈ రాజగోపాల్ దృష్టికి తీసుకెళ్లారు.

మున్సిపాలిటీలో బిల్లుల పెండింగ్

జమ్మలమడుగు మున్సిపాలిటీలో బిల్లులు పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో వాటర్‌ప్లాంట్ల నుంచి బిందె లేక, క్యాన్ నీటిని రూ.3కే ప్రజలకు అందించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం కరెంటు బిల్లులు మున్సిపాలిటీకే సంబంధించిందని, కేవలం ప్రజలకు మాత్రం తక్కువ ధరకు నీళ్ల అందించాలని ఏర్పాటు చేశారు. అయితే పట్టణంలోని కొన్ని వాటర్‌ప్లాంట్లు గతంలోనే మూతపడ్డాయి. మరికొన్ని చోట్ల వాటర్‌ప్లాంట్లు కొనసాగించినా విద్యుత్తు బిల్లులు పెండింగ్ పడ్డాయి. వాటర్‌ప్లాంట్ల యజమానులు విద్యుత్తు బిల్లిస్తామని ప్రస్తుతం తమకే వాటర్‌ప్లాంట్లు కేటాయించాలని కోరినట్లు తెలుస్తోంది. గత నెలలో మున్సిపల్ అధికారులు వాటర్‌ప్లాంట్లను తనిఖీ చేసి విద్యుత్తు బిల్లులు పెండింగ్ ఉన్నాయని, ఇతర సమస్యలపై వాటర్‌ప్లాంట్లను సీజ్ చేశారు. మళ్లీ మున్సిపల్ సిబ్బందితోనే ఆ ప్లాంట్లను కొనసాగిస్తున్నారు. ఏదేమైనా జమ్మలమడుగు మున్సిపాలిటీలో విద్యుత్తు బిల్లుల విషయంలో దాదాపు రూ.2 కోట్లు పెండింగ్ ఉన్నట్లుగా తెలిసింది.



నిరుపయోగంగా ఉన్న విద్యుత్తు కార్యాలయ భవనాలు

విద్యుత్తు ఏఈల కొరత

జమ్మలమడుగు విద్యుత్తు సబ్‌డివిజన్ పరిధిలో గతేడాదిగా మండలాలకు విద్యుత్తు ఏఈలు ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతోంది. దీంతో ఆయా మండలాల్లో రెగ్యులర్ విద్యుత్తు ఏఈలు లేకపోవడం వలన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అన్ని గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు, స్తంభాల సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్లు కొరతతో ఇబ్బందులు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. సబ్‌డివిజన్ పరిధిలో జమ్మలమడుగు రూరల్ పరిధి, మైలవరం, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో ఇన్‌చార్జి ఏఈలు ఉన్నారు. సిబ్బంది కొరత వలన సమస్యలున్నాయి. ఈ సమస్యలపై డీఈ రాజగోపాల్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్తు బిల్లుల బకాయిలు మొత్తం రూ.1.93 కోట్లు ఉందని తెలిపారు. ఆ తర్వాత మళ్లీ పెరిగే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు సంబంధించిన విద్యుత్తు సమస్యలు ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో ముద్దనూరు మండలంలో మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వ్యవసాయానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో ఇటీవలే సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు.



ప్రధాన గేటు వద్ద రోడ్డు దారుణం



నెర్రలు చీలిన విద్యుత్తు కార్యాలయ గోడలు





లోపలి భాగంలో పైకప్పు దెబ్బతిని కడ్డీలు దర్శనం

పంచాయతీల బలోపేతానికి సీఎం కృషి

పీఆర్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరెడ్డి



సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న మునిరెడ్డి

కడప(రూరల్) జూలై 13: గతంలో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 250 కోట్లు పంచాయతీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చాంబర్ ప్రతినిధులు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 14, 15 ఆర్థిక సంఘాల నుంచి పంచాయతీలకు వచ్చిన వేలకోట్ల నిధులను దారిమళ్లించి గ్రామ పంచాయతీల అభివృద్ధిని నిర్వీర్యం చేశారన్నారు. ఈ మేరకు వైసీపీని ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామీణ ప్రాంత ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాకుండా చేశారన్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టి నెల రోజులు కాకముందే 12918 పంచాయతీలకు రూ. 250 కోట్లు నిధులను విడుదల చేసి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు మూడున్నరకోట్ల గ్రామీణ ప్రజల తరుపున ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ సీఎం చంద్రబాబు నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలియజేశామన్నారు.

అంజన్న దర్శనానికి తరలివచ్చిన భక్తజనం



హరికథా కాలక్షేపం వింటున్న భక్తులు

చక్రాయపేట,జూలై 13: రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామి దర్శనానికి భారీఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. స్పెషల్ దర్శనం, వీఐపీ దర్శనం, సర్వదర్శనం లైన్లు కిక్కిరిశాయి. వచ్చిన భక్తులకు ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజారమేష్ తీర్థప్రసాదాలు నొసంగారు. లడ్లు అయిపోవడంతో మళ్లీ తయారు చేయించారు. గండి దేవస్థానంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పులిహోర ప్యాకెట్లను రూ.10కే అందించడంతో దాదాపు 800ప్యాకెట్లు అయిపోయాయి. ఈ వారం తాత్కాలికంగా ప్రవేశపెట్టడంతో భక్తులకు తగినన్ని లభించలేకపోయాయి. ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది నుంచి ఉదయం గుడి తలుపులు తెరవగానే గోపూజ చేసి తలుపులు తెరుస్తున్నారు. రెండో శనివారం సెలవు ఉండడంతో గండికి చేరుకున్నారు.

ఇంటిపై నుంచి పడి కూలీ మృతి

కడప (క్రైం), జూలై 13: లోహియానగర్‌లో సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు చెర్లోపల్లె ప్రసాద్ (50) ఇంటిపై నుంచి పడి కూలీ చనిపోయినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. సీకేదిన్నె మండలం తాడిగొట్ల వాసి చెర్లోపల్లె ప్రసాద్ శనివారం లోహియానగర్‌లో అస్లాంబాష ఇంటిపైన సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

వాహనం ఢీకొని జింక మృతి

ములకలచెరువు, జూలై 13: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందినట్లు అటవీ అధికారులు తెలిపారు. పీటీఎం రోడ్డులోని నాయనిచెరువుపల్లె సత్రం వద్ద రోడ్డు దాటుతున్న జింకను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో జింక తీవ్రంగా గాయపడడంతో గమనించిన మధు అటవీ అధికారులకు తెలియజేశారు. సిబ్బంది చికిత్స నిమిత్తం పశువైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందింది. జింక కళేబరాన్ని అటవీ ప్రాంతంలో ఖననం చేశారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్)జూలై 13: కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం 17.9.2023 నుంచి ప్రారంభించారు. ఇందులో 18 రకాల కులవృత్తులవారు లబ్ధిపొందవచ్చని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. సచివాలయం, గ్రామ స్థాయిలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు. చర్మకారులు, చెప్పులు కుట్టువారు, రజకులు, దర్జీలు, మత్స్యకారులు, కళాకారులు, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, క్షరకులు, తాపీమేస్త్రీ, శిల్పకళాకారులు నమోదు చేసుకోవచ్చన్నారు. పూర్వీకుల నుంచి కుటుంబ వృత్తిగా చేస్తున్న వారు అర్హులు. లబ్ధిదారులు ఎలాంటి రుణాలు పొంది వుండకూడదు. ఒకరికే నమోదుకు అర్హులు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ దగ్గర, కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోగలరు.

తిరుపతిలో కడప మహిళ దారుణహత్య

- గొంతుకోసిన గుర్తు తెలియని వ్యక్తి



తిరుపతి రూరల్, జూలై 13: కడప జిల్లాకు చెందిన మహిళ ప్రసన్న అలియాస్ రెడ్డెమ్మ(58) తిరుపతి జిల్లాలో దారుణహత్యకు గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా చెన్నూరు మండలం కొండపేట వాసి భూమిరెడ్డి బాలిరెడ్డి భార్య ప్రసన్న అలియాస్ రెడ్డెమ్మ, కుమార్తె గుర్రమ్మతో కలసి బతుకుదెరువు నిమిత్తం సుమారు 30 ఏళ్ల కిందట తిరుపతికి వచ్చారు. గుర్రమ్మకు కంటిచూపు సరిగా కనిపించక పోవడం, మానసిక పరిస్థితి సరిగా లేదు. దాదాపు పదేళ్ల కిందట తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో తిరుపతి వాసి బి.మాలతి స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. అందులో శ్రీబాలాజి పార్కింగ్ యార్డ్ పేరిట ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు సీజ్ చేసిన వాహనాలను పార్కింగ్‌చేసి వారి నుంచి ఫీజు వసూలు చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బాలిరెడ్డి వృద్ధాప్య పింఛను తీసుకోవడానికి ఈనెల ఒకటో తేదీన కుమార్తెతో కలసి స్వగ్రామానికి వెళ్లాడు. కుమార్తె ఈనెల 8న తిరుపతికి రాగా, సొంతపనుల నిమిత్తం బాలిరెడ్డి స్వగ్రామంలోనే ఉండిపోయాడు. శనివారం ఉదయం దాదాపు 5.30గంటలకు కుమార్తె స్నానం చేయడానికి వేడినీరు పెట్టడానికి తల్లి రెడ్డెమ్మ సిద్ధమవుతోంది. ఈసమయంలో బ్లూషర్ట్ ధరించి ఉన్న వ్యక్తి గోడదూకి ఇంట్లోకి వచ్చి కుమార్తె గొంతు పట్టుకోవడంతో ఆమె పెద్దగా కేకలు వేసింది. ఈ కేకలు విన్న తల్లి రావడంతో ఆ వ్యక్తి తన చేతిలో కత్తితో ఆమె గొంతు కోసి గోడదూకి పరారయ్యాడు. కొంతసేపటికి గుర్రమ్మ ఎదురుగా ఉన్న కిరాణా దుకాణం వద్దకొచ్చి తన తల్లి చనిపోయిందని చెప్పింది. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదన్న కారణంతో దుకాణ నిర్వాహకురాలు రాధమ్మ పెద్దగా పట్టించుకోలేదు. అయితే గుర్రమ్మ ఏడుస్తూ ఎంతకూ అక్కడినుంచి వెళ్లకపోవడంతో అటుగా వెళుతున్న పారిశుధ్య కార్మికుడికి విషయం చెప్పింది. తర్వాత ముగ్గురూ కలిసి రెడ్డెమ్మ ఇంటికెళ్లారు. గేటు తాళం వేసి ఉండడంతో ఎలా బయటకు వచ్చావని గుర్రమ్మను ప్రశ్నిస్తే.. గేటు ఎక్కి దూకానని చెప్పింది. తాళం ఎక్కడుందని అడిగితే గేటు ఎక్కి లోపలికెళ్లి తీసుకొచ్చింది. గేటు తాళం తీసి ఇంటి లోపలకు చూడగా.. రెడ్డెమ్మ రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉంది. భయపడి వారు వెనక్కి వచ్చేశారు. సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. జాగిలాలు హత్య జరిగిన ప్రదేశం నుంచి గంగిరెద్దులకాలనీ వరకు వచ్చి ఆగిపోయాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇంట్లోని బీరువాలో ఉన్న వెండి వస్తువులు బయటపడినట్లు సమాచారం.

అమ్మ చనిపోయింది.. చైనూ ఎత్తుకెళ్లారు

అమ్మా చనిపోయింది.. తన మెడలోని చైనూ ఎత్తుకెళ్లారు అంటూ శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గేటు బయట రోడ్డుపై కూర్చుని విలపిస్తున్న గుర్రమ్మను చూసిన వారంతా కంటతడి పెట్టారు.

బండకింద తండాలో 10 జీవాలు మృతి

పెద్దమండ్యం, జూలై 13: జీవాలు బలంగా పెరగడం కోసం తాగించే పెరుగు మందుని పొరపాటున పొలాల్లో గడ్డి నివారణ మందు తాగించడంతో 10 గొర్రెలు మృత్యువాత పడినట్లు పెద్దమండ్యం పశు వైద్యాధికారి ఉస్మాన్ వెల్లడించారు. రామానాయక్ తండా పంచాయతీ బండకింద తండా వాసులు బొడ్డు నాయక్, రమేష్ నాయక్ గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి మం దలోని 4 గొర్రెలు ఆకస్మికంగా మృత్యువాత పడగా కడుపు ఉబ్బరం, కాళ్లు విదిలిస్తూ మ రో ఏడు గొర్రెలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న వెటర్నరీ డాక్టర్ ఉస్మాన్ మిగిలిన గొర్రెలకు వైద్యసేవలందించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ములకలచెరువు, జూలై 13: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు... బురకాయలకోట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మధ్యాహ్నం రైలు కింద పడ్డాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి కుడి ఛాతిపై కాలిన గాయం, బ్లూ కలర్ లుంగీ ధరించి ఉన్నాడని, బంధువులు, కుటుంబీకులు గమనిస్తే తమకు సమాచారం అందజేయాలని కదిరి రైల్వే ఎస్ఐ ఇబ్రహీం తెలిపారు.

వైభవంగా మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, జూలై 13: ధర్మపథం సమూహాలయంలో శనివారం ఆలయ ప్రాంగణంలోని శనేశ్వర స్వామికి మహాతైలాభిషేకం జరిగింది. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్న వితరణ చేపట్టారు. ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

పిచ్చలవాండ్లపల్లె వద్ద ఇసుక నిల్వలు స్వాధీనం

కురబలకోట, జులై 13: మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ సమీపంలో నిర్మిస్తున్న రిజర్వాయర్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రెవెన్యూ, పోలీసులు అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు అక్కడికి వెళ్లి తనిఖీ చేపట్టారు. ఇక్కడ రిజర్వాయర్ నిర్మాణం కోసం భారీ స్థాయిలో ఇసుకను నిల్వ ఉంచారు. దీంతో అక్కడ ఉన్న నిల్వలను, అక్కడ భారీస్థాయిలో ఇసుక గుట్టల నిల్వలను గుర్తించారు. ఆ ఇసుకకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో నివేదికలను కలెక్టర్‌కు పంపించనున్నట్లు డీటీ నవీన్‌తాజ్ పేర్కొన్నారు. కాగా వాటికి సంబంధించి గనుల, భూగర్భ శాఖాధికారులు రెండు రోజుల్లో ఇక్కడికి వచ్చి నిల్వలు సంబంధించి అంచనా వేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

జోరుగా వరినాట్లు

చెన్నూరు, జూలై 13 : చెన్నూరు మండలంలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బోర్ల కింద వరి నాట్లు ప్రారంభమయ్యాయి. చెన్నూరుతో పాటు రామనపల్లె, ముండ్లపల్లె, కొండపేట, బలసింగాయపల్లె, కనుపర్తి తదితర గ్రామాల్లో బోర్లు ఉన్న రైతులంతా వరినాట్లు చేపట్టారు. కొన్ని గ్రామాల పరిధిలోని పొలాల్లో రైతులు వరి నాటేందుకు పొలాన్ని సిద్ధం చేస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో పొలం దుక్కిచేసి నాట్లు వేస్తున్నారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులందరూ వరినాట్ల సేద్యం పనుల్లో బిజీ.. బిజీగా ఉండటంతో మండలంలోని ఆయా గ్రామాల పొలాల్లో సందడి నెలకొంది.



రామనపల్లె వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు... నాట్లు వేసేందుకు సిద్ధంగా వరి నారు కట్టలు పొలంలో వేసిన దృశ్యం

ఆశాలపై రాజకీయ వేధింపులు ఆపాలి

కడప (మారుతీనగర్), జూలై 13: జిల్లాలో ఆశా కార్యకర్తలపై రాజకీయ నాయకులు చేస్తున్న వేధింపుల ఆపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ కోరారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా ఆశా కార్యకర్తలను బెదిరించే చర్యలు మానుకోవాలన్నారు. లేదంటే గత వైసీపీ ప్రభుత్వానికి పట్టిన గతే ప్రస్తుత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానికి పట్టడం తథ్యమన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ, ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి అమ్ములు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిశీలించి పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే మాధవీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



సమస్యలను ఎమ్మెల్యేకు తెలుపుతున్న కడప నగర ప్రజలు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 13: కడప నియోజకవర్గంలో గల ప్రతి సమస్యనూ పరిశీలించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ద్వారకనగర్ శ్రీనివాసరెడ్డి నివాసంలో ప్రజాదర్బార్‌కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జనం సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వాటన్నింటినీ ఎమ్మెల్యే నోట్ చేసుకుని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీపీఎస్‌పై ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలి: యూటీఎఫ్

● కలెక్టరేట్ ఎదుట జీపీఎస్ జీఓ ప్రతుల దహనం





జీపీఎస్ జీఓ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతున్న గజ్జల వెంకట సత్యనారాయణ

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 13: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2023 అక్టోబరు 20 నుంచి జీపీఎస్ విధానాన్ని అమలు పరుస్తూ ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట జీపీఎస్ ప్రతులను దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచనకు గురి చేస్తూ జీపీఎస్ అనే దుర్మార్గపూరిత పెన్షన్ చట్టం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యూటీఎఫ్ చేసిన పోరాటాల ఫలితంగా ఎన్నికల ముందు గత ప్రభుత్వం జీపీఎస్ అమలు చేయలేదని, అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ఉద్యోగ ఉపాధ్యాయులకు భరోసా లేని పెన్షన్ విధానాన్ని బలవంతంగా రుద్దడాన్ని పూనుకోవడం మంచిది కాదన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను అడుగడుగునా వేధింపులకు గురి చేయడం వల్లే తగిన మూల్యం చెల్లించకుందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం కొలువైన కొద్దిరోజులైనా ఉద్యోగ ఉపాధ్యాయులకు తీరని జీపీఎస్ అమలు వంటి నిర్ణయాలు తీసుకోవడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీపీఎస్, సీపీఎస్ విధానాలు రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, లేదంటే భవిష్యతులో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్, చంద్రశేఖర్, ఏడీ దేవదత్తం, మాలే బాబు, చెన్నయ్య శివశంకర్‌రెడ్డి, అబ్దుల్ గని పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించండి: ఏపీ ఉపాధ్యాయ సంఘం

దశాబ్ద కాలం పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటసత్యనారయాణ డిమాండ్ చేశారు. శనివారం ఆపస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో సీపీఎస్‌కు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రకటించిన ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ఉద్యోగ ఉపాధ్యాయులతో ఎటువంటి సమావేశం నిర్వహించకండా అభిప్రాయాలు తీసుకోకుండా ఇలాంటి చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయప్రసాద్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యా వ్యవస్థకు గొడ్డలిపెట్టులాంటి జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, రాధాక్రిష్ణయ్య పాల్గొన్నారు.

జీపీఎస్ రాజపత్రాన్ని ఉపసంహరించుకోవాలి: యూటీఎఫ్

వేంపల్లె, జూలై 13: జీపీఎస్ పింఛన్ విధానాన్ని అమలుపరుస్తూ ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉదయం బాలుర ఉన్నత పాఠశాల వద్ద రాజపత్రాలను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు జీపీఎస్ అనే విధానాన్ని చట్టం చేసి గెజిట్‌లో ఉంచిందని అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భరోసా లేని పింఛన్ విధానాన్ని అమలుకు పూనుకోవడం మంచిది కాదన్నారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, లేకుంటే పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. పాతపింఛన్ విధానాన్ని వెంటనే పునరుద్దరిస్తూ వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సీపీఎస్ జిల్లా కన్వీనర్ సుదర్శన్, ఉపాధ్యాయులు ఓబుల్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.



రాజపత్రాలను దహనం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

'రాజ్యాంగ హక్కుల కోసం పోరాటం చేయడమే మా లక్ష్యం'

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 13 :కడప నగరంలోని హుజురా మసీదులో శనివారం ఆలిండియా మిల్లీ కౌన్సిల్ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ ఖదీర్, సోయేబి, నిజామిలు హాజరై మాట్లాడారు. దేశంలో వెనుకబడిన ప్రజల రాజ్యాంగ హక్కుల కోసం పోరాటం చేయడం మా భవిష్యత్తు కర్తవ్యమని అన్నారు.

అట్టడుగు ప్రజల హక్కుల కోసమే పోరాటం చేయడమే మా అజెండా అని తెలిపారు. భారత ప్రజల మధ్య ఐకమత్యాన్ని పెంపొందించడం వారి ఆశయాలకనుగుణంగా రాజ్యాంగం ద్వారా శాసనాల ద్వారా మనకు రావాలసిన హక్కుల కోసం మన ప్రజల ఐక్యత కోసం ప్రధాన కర్తవ్యమని తెలిపారు. ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ 51 మందితో జిల్లా నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షుడిగా హిదయతుల్లా, ప్రధాన కార్యదర్శిగా ఇషాక్‌అలీ, సహాయ కార్యదర్శిగా అన్సర్ అలీఖాన్, ట్రెజరర్‌గా మహ్మద్‌లను ఎన్నుకున్నారు.

ఆన్‌లైన్‌లో భూమి ఎక్కించండి



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

కమలాపురం రూరల్, జూలై 13 : తన పూర్వీకుల నుంచి ఇప్పటి వరకు భూమి మేమే సాగు చేసుకుంటున్నామని, అటువంటి భూమిని మాకు తెలియకుండా ఆన్‌లైన్‌లో నుంచి తొలగించారని పుత్తా సుబ్బారెడ్డి అనే వ్యక్తి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతనంగా విడుదల చేసిన పట్టాదారు పాస్‌బుక్కుల్లో సర్వే నెం.153లో 0.70 సెంట్లు భూమి తన పూర్వీకుల నుంచి మేమే సాగు చేసుకుంటున్నామని ఇప్పటికీ ఆ భూమి మా స్వాధీనంలోనే ఉందని ఇలాంటి సమాచారం లేకుండా రెవెన్యూ అధికారులు మా పేరుపైన భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించడం శోచనీయమని ఆయన వాపోయారు. రీసర్వే పేరుతో రైతులను అన్నిరకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

ఈ విషయంపై మండల రెవెన్యూ అధికారుల చుట్టూ పలు మార్లు తిరిగినా అధికారులు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన చెప్పారు. మండల రెవెన్యూ అధికారులను ఆన్‌లైన్‌లో తన పొలం ఎక్కించకపోవడంపై ప్రశ్నించగా రీసర్వే పెట్టుకోవాలని ఉచిత సలహాలు ఇవ్వడం శోచనీయమన్నారు. రీసర్వే కోసం సంబంధిత అధికారులను సంప్రదించగా రీసర్వే ఆన్‌లైన్ పనిచేయలేదని చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తన పొలం పట్టాదారు పాస్‌బుక్కుల్లో ఎక్కించేలా చూడాలని బాధితుడు కోరుతున్నాడు.

ఆర్‌సీడీఎస్‌కు రూ.56116 ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందుకుంటున్న సురేంద్రారెడ్డి

పులివెందుల రూరల్, జూలై 13: రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (ఆర్‌సీడీఎస్)కు రూ. 56116 ఆర్థికసాయం అందినట్లు సొసైటీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తెలిపారు. శనివారం సింహాద్రిపురం మండలానికి చెందిన వెన్నపూస అరవిందనాథరెడ్డి ఈ సాయం అందించినట్లు సురేంద్రరెడ్డి తెలిపారు. రెడ్ల ఘన చరిత్ర పుస్తక ప్రచురణకై ఆర్థిక సాయాన్ని అందించారన్నారు. రెడ్డి జాతి వైభవాన్ని రేపటి తరాలకు అందించాలనే ఉద్దేశంతో రెడ్ల ఘన చరిత్ర అనేపుస్తకాన్ని రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

శివ చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్‌గా నరేంద్ర

● ఆలయ అభివృద్ధికి సేవలందించండి

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి



మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, జూలై 13: మండల పరిధిలోని పెద్దచెప్పలి గ్రామంలో వెలసి ఉన్న అతి పురాతనమైన శివచెన్నకేశవస్వామి ఆలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి హాజరయ్యారు.

ఆలయ అధ్యక్షునిగా ఆకుల నరేంద్ర ఎన్నిక అయ్యారు. నూతన కమిటీ సభ్యులుగా మరో 8 మందిని నియమితులయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ఆలయ ఈవో జగన్ ఆలయ చైర్మన్ ఆకుల నరేంద్ర, కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ పురాతన శివాలయ అభివృద్ధికి అన్నివిధాలా నూతన కమిటీ తోడ్పాటునందించాలన్నారు. గతంలో ఈ ఆలయం శిధిలావస్థలో ఉండేదని, చంద్రబాబు సీఎం అయ్యాక ఈ ఆలయ అభివృద్ధి కోసం అధిక శాతం నిధులు వెచ్చించి ఆలయ అభివృద్ధి పథంలో నడిపించారన్నారు.ప్రస్తుతం గాలిగోపురం శిధిలావస్థలో ఉందని దానిని కూడా నిర్మాణం చేపడతామన్నారు. దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తమ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాఘవరెడ్డి, వాసుదేవరెడ్డి, నాగిరెడ్డి, ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు ప్రభాకర్‌రెడ్డి, తోట వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సుధాకర్, రఫి, నరసింహులు, హనీఫ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తను పరామర్శించిన పుత్తా

సీకేదిన్నె, జూలై 13: టీడీపీ కార్యకర్త అన్నంరాజు ఆదినారాయణను శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ అన్నంరాజు వెంకటసుబ్బయ్య తమ్ముడు అన్నంరాజు ఆదినారాయణ ఇటీవల కొలుములపల్లె పంచాయతీ క్రిష్ణాపురం గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాదానికి గురై ఏలూరు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చారు. ఆదినారాయణ ప్రమాదం జరిగిన విషయాన్ని స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న పుత్తా నరసింహారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని ఎప్పుడు ఏ సాయం కావాలన్నా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం మోహన్‌బాబు, నాయకులు మహేంద్రారెడ్డి, రవి, డీవీ, రహీం, శంకర్, వెంకటసుబ్బయ్య, హరి, నారాయణ, రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన తుంగా రమణయ్య



సీఎం రమేశ్‌ను సత్కరిస్తున్న జనసేన నేత తుంగా రమణయ్య

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 13 : అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేశ్‌నాయుడును కడప జనసేన నాయకుడు తుంగా రమణయ్య ఎర్రగుంట్ల పోట్లదుర్తి ఎంపీ నివాసంలో శనివారం ఎంపీ సీఎం రమేశ్‌కు శాలువా కప్పి పూలమాల వేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తుంగా రమణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిందని కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అనకాపల్లి ఎంపీ మాట్లాడుతూ అనకాపల్లితో పాటు కడప జిల్లాను అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళుతుండడం శుభ పరిణామమన్నారు. జిల్లాలో మంచి పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరామన్నారు. కడప ఉక్కు పరిశ్రమకు తమ మద్దతు ఇవ్వాలని జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వల్ల ఎంతో మందికి ఉపాధి దొరుకుతుందన్నారు.

వేడుకగా ప్రారంభమైన మొహర్రం వేడుకలు



పీర్ల చదివింపులు చేపడుతున్న గ్రామస్థులు

వల్లూరు, జూలై 13 : మొహర్రం పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహిస్తున్నారు. హిందూ, ముస్లిం అనే బేధం లేకుండా అందరూ కలిసికట్టుగా వేడుకలు నిర్వహించుకుంటారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా పెద్దపుత్త గ్రామంలో పీర్లను స్థానిక గ్రామస్థులు కలిసి ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో తప్పెట్లు, బ్యాండు తాళాలతో గ్రామంలో గ్రామోత్సవం నిర్వహిస్తారు. హిందూ, ముస్లిం అనే బేధం లేకుండా ప్రతి ఒక్కరూ చదివింపులను వారికి అందిస్తారు. మొహరం రోజున ఈ వేడుకలు ముగుస్తాయని కార్యనిర్వాహకులు తెలిపారు. అంతకుముందు రోజున గుండం కార్యక్రమం చేపడుతామన్నారు.

వైసీపీ పాలనలో రోడ్ల పరిస్థితి అధ్వానం

● టీడీపీ నేత రవిశంకర్‌రెడ్డి



12వ డివిజన్ స్థానికులతో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 13 : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించి రోడ్ల నిర్మాణం ప్రారంభించాలని కోరారు. శనివారం 12వ డివిజనులో ఆయన పర్యటించారు. అక్కడి సమస్యలు అడిగి తెలుసుకోగా, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెప్పినట్లు తెలిపారు. అలాగే వర్షం పడిందంటే.. రోడ్లన్నీ బురదమయం అవుతాయన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు చెప్పిన సమస్యలను ఎమ్మెల్యే మాధవీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే కార్పొరేషన్‌లో కూడా త్వరితగతిన పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చెప్పిస్తానన్నారు.

సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి

● విద్యార్థి సంఘాల డిమాండ్



ఆర్ఐఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 13 : జిల్లాలో రెండో శనివారం సెలవుదినాన కూడా ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారని, ఆయా జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్ఐఓ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, పీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ మాట్లాడుతూ రెండో శనివారం కూడా విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా అధ్యాపకుల చేత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని, ఇలా చేయడం పట్ల విద్యార్థుల స్వేచ్ఛను హరించిన ట్లేనన్నారు. జిల్లాలో చాలా చోట్ల ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు తరగతుల నిర్వహిస్తున్నాయన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఒక న్యాయం, కార్పొరేట్ పాఠశాల్లోని వారికి మరో న్యాయమా అని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, కిరణ్, రమణ, పీఎస్‌యు నాయకులు సుబ్రమణ్యం, నరేశ్, ఎఐఎస్‌బీ నాయకులు పాల్గొన్నారు.

అధికారులకు సెలవులు.. విద్యార్థులకు తరగతులు

● ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ నిరసన



నిరసన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 13 : అధికారులకు సెలవులు.. విద్యార్థులకు తరగతులు నిర్వహించడం దుర్మార్గమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు తెలిపారు. శనివారం ఆర్ఐఓ కార్యాలయం ఎదుట సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సెలవు దినాల్లో తరగతులు నిర్వహించడం విద్యార్థి హక్కులను కాలరాయడమేనన్నారు. విద్యార్థుల సృజనాత్మకత, స్వేచ్ఛతో ర్యాంకులకు పెట్టుబడిగా పెడుతున్నారన్నారు. పరీక్షల పేరుతో విద్యార్థులను యంత్రాలుగా మార్చి ఒత్తిడి పెట్టడం వల్ల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అఖిరానంద్, తేజ, చంద్ర, మస్తాన్, రాజేశ్, అశోక్, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పర్యటించడం అభినందనీయం

కమలాపురం రూరల్, జూలై 13 :ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు పర్యటించి నగర పంచాయతీ అభివృద్దే ధ్యేయంగా ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి కృషి చేస్తున్నారని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన అధినేతలతో మాట్లాడారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు ప్రజల వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకోవడం అభినందనీయమాన్నరు. అందులో భాగంగా ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి కమలాపురం నగర పంచాయతీలో పర్యటించి అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారన్నారు. అక్కడే అధికారులతో డ్రైనేజీ వ్యవస్థలో ఉన్న చిన్న చిన్న లోపాలను సరిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారన్నారు. వర్షాకాలం వచ్చిందని వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రజలు చాల ఇబ్బందులు పడతారని, వెంటనే ఈ సమస్య పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించడం, అధికారులు కూడా వెంటనే చర్యలు చేపట్టడం చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వైస్ ప్రెసిడెంట్ శంకర్‌యాదవ్, కాపు నాయకులు దాది రామయ్య, పల్లె రామసుబ్బారెడ్డి, శేషారెడ్డి, ఎల్లారెడ్డి, రమణారెడ్డి, ఈశ్వరరెడ్డి, రామిరెడ్డి, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

● 15న ఆలయాలు మూసివేత



ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ సిద్ధాంతి

వేంపల్లె, జూలై 13: బ్రాహ్మణులను, బ్రాహ్మణ స్త్రీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన దామోదర రామానుజ దాస్ పైలా అలియాస్ దాస్ పైలా అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత బ్రాహ్మణ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి డిమాండ్ చేశారు. శనివారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 15వ తేదీ సోమవారం ఆలయాల మూసివేతకు సంఘం పిలుపునిచ్చిందన్నారు. దాస్ పైలా అనే వ్యక్తి కొంతకాలంగా ఫేస్‌బుక్, వాటట్సాప్, యూట్యూబ్‌లలో బ్రాహ్మణులు, బ్రాహ్మణస్త్రీలపై నీచాతినీచంగా పోస్టులు పెడుతున్నాడన్నారు.

'ఉపాధ్యాయ పోస్టులలో న్యాయం జరిగేలా చూడండి'

కడప (మారుతీనగర్), జూలై 13: రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టులలో ప్రాథమిక, యూపీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉర్దూ ఎస్జీటీ పోస్టులతో పాటు మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రతి ఉర్దూ మీడియం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని అల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) జాతీయ కార్యదర్శి షాకీర్‌హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు నజీర్‌బాషా కోరారు. ఆ మేరకు శనివారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని నగర ద్వారకానగర్‌లోని ఆమె నివాసంలో ఐటా అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పదవ తరగతి పాఠ్యపుస్తకాలు మారినప్పటికీ ప్రథమ భాష ఉర్దూ పాఠ్యపుస్తకాన్ని వర్క్‌షాపు నిర్వహించి మన రాష్ట్ర వ్యవహార సరళికి, వాడుక భాషకు, సామర్థ్యాలకు అనుగుణంగా నిష్ణాతులైన భాషా పండితులచే తయారు చేయకుండా 2007 తయారైన ఎన్‌సీఈఆర్‌టీ ఉర్దూ పాఠ్యపుస్తకాలను సరఫరా చేయడం బాధాకరమన్నారు.

రైస్‌మిల్లు తనిఖీ



బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు శిరీషా

పోరుమామిళ్ల, జూలై 13 : రిపోర్టు వస్తే రైస్‌మిల్లర్లపై తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శిరీషా తెలిపారు. గురువారం సాయంత్రం పోరుమామిళ్లలోని ఓ రైస్‌మిల్లులో ఆకస్మికంగా తనిఖీలు చేసి అనుమానంగా ఉన్న బియ్యం బస్తాలను పరిశీలించారు. దాదాపు 4832 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గోడౌన్‌కు తరలించారు. ఇది ప్రజా పంపిణీకి సంబంధించిన బియ్యమా కాదా అని నిర్ధారణ చేసుకునేందుకు కడప డీఎం ఆఫీసుకు శుక్రవారం స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పంపామని ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. అక్కడ నుంచి రిపోర్టు వచ్చిన తరువాత తహసీల్దారు తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

ఎర్రచందనం జోలికొస్తే కఠిన చర్యలు



ఖాజీపేట, జూలై 13: అటవీప్రాంతంలో అనుమానాస్పదంగా ఎవరైనా కనపడితే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఫారెస్టు రేంజి ఆఫీసర్ ఎం.హేమాంజలి అన్నారు. శనివారం మండల పరిధిలోని చింతలపెంట, మామిలేరు, రాయలచెరువు ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రచందనం జోలికి వస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అటవీప్రాంతాల్లో కొత్తవారు కనపడితే సమాచారం ఇవ్వాలని ఇప్పటికే పలు గ్రామాల్లో ఎర్రచందనంపై అవగాహన కల్పించామన్నారు. ఎర్రచందనం జోలికి వస్తే కుటుంబాలకు, పిల్లలకు దూరమై జైలుపాలుకాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.రవిచంద్ర, లింగానాయక్, నాగలక్ష్మి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, జూలై 13 :మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో ఆషాడమాసం రెండో శనివారం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. వేకువజామునే ప్రత్యేక అభిషేకం అనంతరం పూజలు నిర్వహించారు. పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

సేంద్రియ ఎరువు... పొలానికి ఆదరువు

- సేంద్రియ విధానంపై దృష్టి సారిస్తున్న రైతులు

మైలవరం, జూలై 13 : వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వినియోగానికి బదులు ప్రకృతి, సేంద్రియ విధానం ద్వారా సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఏటా పెరుగుతున్న పెట్టుబడుల నుంచి ఉపశమనం కలిగించే ఈ విధానం భూమి సారవంతం కావడానికి ఉపయోగపడుతుండడంతో అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మూగ జీవాలు (గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు) పెంచేవారికి ఈ విధానం చక్కటి ఆదాయ మార్గంగా నిలుస్తుంది. పశువుల విసర్జితాలను నిల్వ చేయడంతో పాటు నేరుగా జీవాలను రెండు, మూడు రోజులు పొలంలో ఉంచడం ద్వారా నిస్సారమైన పొలం తిరిగి జీవం పోసుకుంటుంది. భూసారం తగ్గిపోవడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దిగుబడి పెంచేందుకు రైతులు రసాయనిక ఎరువు వినియోగాన్ని పెంచుకుంటూ పోతుండడంతో పరిస్థితి మరింత దిగజారిపోవడమే కాకుండా రైతులపై ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో జీవాల విసర్జితాలతో ఈ లోపాన్ని సంప్రదాయ విధానం ద్వారా భర్తీ చేయవచ్చు. జీవాల విసర్జితాలు పంటలకు ఉపయోగపడే కర్బనం శాతాన్ని పెంచుతాయి. సూక్ష్మపోషకాలైన ఫెర్రస్, మాంగనీసు, కాపర్, మెగ్నీషియం, తదితరాలతో పాటు ప్రధాన



పొలంలో కుప్పలుగా నిల్వ ఉంచిన జీవవిసర్జితాల ఎరువు

పోషకాలైన ఫాస్పర్, పొటాష్, నైట్రోజన్, తదితర పోషకాలు కూడా ఉండడంతో భూసారం పెరుగుతుంది. దీంతో పాటు వీటిని ఉపయోగించడం వలన తేమను పట్టుకొనే శక్తి పెరుగుతుంది.

సేంద్రియ ఎరువులపై అవగాహన పెంచుతున్నాం

ప్రజలకు సేంద్రియ ఎరువులను పొలంలో ఉపయోగించాలని, మంచి దిగుబడులు వస్తాయని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడడం వల్ల పంట నాణ్యమైన దిగుబడి వస్తుంది.

విజయారావు, వ్యవసాయాధికారి, మైలవరం

పెట్టుబడి తగ్గుతుంది - నాగయ్య, రైతు



సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా పెట్టుబడి తగ్గుతుంది. సొంతంగా వర్మీకంపోస్టు ఏర్పాటు చేసు కోవటంతో పాటు జీవ విసర్జితాలతో ద్రావణాలు తయారు చేసి, పురుగుల మందులకు బదులు ఎక్కువ మంది రైతులు వాటిని వినియోగిస్తున్నారు. సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా నాణ్యమైన దిగుబడి వస్తుంది.

రైతులు ఆసక్తి చూపిస్తున్నారు - రామచంద్రారెడ్డి, కల్లుట్ల.



గ్రామాల్లో రైతులు పొలాల్లో ఎక్కువగా జీవాల మందను ఉపయోగించుకుంటున్నారు. అలాగే గేదెల పేడను పొలాల్లో వినియోగిస్తున్నారు. గతంలో కంటే ఇటీవల కాలంలో ఈ విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీని ద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుంది.

జీపీఎస్ అమలు గెజిట్ విడుదల దుర్మార్గం

జమ్మలమడుగు, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ అమలు చేస్తూ గెజిట్ విడుదల చేయడం దుర్మార్గపు చర్య అని ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తున్నట్లు జమ్మలమడుగు యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్.నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ అన్నారు. శనివారం జమ్మలమడుగు యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్ద యూనియన్ నాయకులు గెజిట్ పత్రాలతో నిరసన అనంతరం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవిశంకర్, వెంకటసుబ్బయ్య, ఓబులేసు, మల్లికార్జున, మురళీమోహన్‌రెడ్డి, పవన్‌కుమార్, మహమ్మద్‌రఫీ, తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల...: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలు చేస్తూ రాజపత్రం విడుదల చేయడం పట్ల ఈపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్యయాదవ్ ఖండించారు. శనివారం వారు ఎంఈవో కార్యాలయం ఎదుట పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌విధానం పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్





పోరుమామిళ్ల, బద్వేలులో జీపీఎస్ పత్రాలను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సభ్యులు క్రిష్ణయ్య, బాలచంద్రయ్య, చెన్నక్రిష్ణయ్య. జాషువా, భైరవ ప్రసాద్, పుల్లయ్య పాల్గొన్నారు. అలాగే ఎస్టీయూ ఆధ్వర్యంలో గ్యారంటీ పెన్షన్ విధానం రద్దు చేయాలని పోరుమామిళ్ల మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య, జయరామిరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు పాల్గొన్నారు.

బద్వేలు...: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రాజపత్రాలను దహనం చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ కార్యకమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓబుల్‌రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు శివప్రసాద్, బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల ప్రధాన కార్యదర్శులు సుధాకర్, కృష్ణుడు, కంచిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెన్నయ్య, మస్తాన్ వల్లి పాల్గొన్నారు.

బీసీలకు పార్టీలో ప్రాధాన్యత పెంచాలి



పల్లా శ్రీనివాసయాదవ్‌తో గుర్రప్ప యాదవ్

ప్రొద్దుటూరు, జూలై 13 : టీడీపీని అధికారంలోకి తీసుకురావడంలో బీసీలది గణనీయమైన పాత్ర అని వారికి పార్టీలో సముచిత స్థానాలు ఇచ్చి గౌరవించాలని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సి గుర్రప్పయాదవ్ పేర్కొన్నారు. శనివారం మంగళగిరి లోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కోసం కష్ట పడ్డ బీసీలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

రాజ్యాంగ హత్యాదినంగా ప్రకటించడం హాస్యాస్పదం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 13: జూన్ 25ను రాజ్యాంగ హత్యాదినంగా మోదీ ప్రభ్వుం ప్రకటించడం హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 352 ప్రకారం బయటి నుంచి అంతర్గతంగా దేశభద్రతకు ప్రమాదం ఉన్నప్పుడు ఎమర్జెన్సీ ప్రకటించవచ్చునని తెలిపారు. పది సంవత్సరాల మోదీ పాలనలో ఐటీ, ఈడీ , సీబీఐ, ఎన్ఐఏ, ఎలక్షన్ కమిషన్, మీడియా, న్యాయవ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తోందని విమర్శించారు. మోదీ పాలనలో ప్రతిరోజును రాజ్యాంగ హత్యాదినంగా ప్రకటించవచ్చునని తెలిపారు.

వైజ్ఞానిక శిక్షణతరగతులను జయప్రదం చేయండి

బద్వేలు, జూలై 13: ఈ నెల 24,25,26 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లి హార్సిలీ హిల్స్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులకు జరిగే శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ బద్వేలు పట్టణ కార్యదర్శి నాగేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్ రంగంలోని పారిశుధ్య , ఇంజనీరింగ్ విభాగాలలో ఉద్యోగులు, కార్మికులను చైతన్య పరిచేందుకు ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు జేవీ.రమణ, నరసింహులు, ఆదినారాయణ, ప్రసాద్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

భాషాభిమానం పెంపొందించుకోవాలి

బద్వేలు, జూలై 13: తెలుగు ప్రజలందరూ భాషాభిమానాన్ని పెంచుకోవాలని తెలుగుభాష వికాసం ఉద్యమ జిల్లా అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. శనివారం మొల్ల సాహితీపీఠం, శ్రీ భాగ్యరత్న ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాతృభాషాభివృద్ధికి స్పష్టమైన విధి విధానాలను ఏర్పాటు చేసి తగినంత నిధులను సమకూర్చి అధికారాలను ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖమంతి నారా లోకేష్, కలెక్టర్‌కు వినతిపత్రాలను పంపినట్లు తెలిపారు.

బుడగజంగం ప్రజల హక్కులను కాపాడాలి



ఎంపీ రమేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 13: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బుడగ జంగం హక్కులను కాపాడాలని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు అనకాపల్లి ఎంపీ రమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ద జమ్మయ్య మాట్లాడుతూ తమకు కుల ధృవీరణ పత్రాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి అగన్న, వెంకటేషు, బాలచెన్నయ్య, మల్లికార్జున, సమర, టీడీపీ నాయకులు మాడెం సుధాకర్‌రెడ్డి, రుషి చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి...: రాష్ట్ర వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అనకాపల్లి ఎంపీ సురేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, సంఘం రాష్ట్ర కార్యదర్శి సందీప్‌కుమార్, సీహెచ్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్, క్రాఫ్ట్ వ్యాయామ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, జూలై 13 : ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉద్యోగులను రెగ్యులర్ చేసేలా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆర్ట్‌క్రాఫ్ట్ వ్యాయామ పార్ట్ టైం ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్ట్ టైం నుంచి పూర్తి స్థాయిలో నియమించుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

కాశినాయన ఇన్‌చార్జి ఎస్ఐగా తాహిర్ హుస్సేన్

కాశినాయన,జూలై13: కాశినాయన మండల ఇన్‌చార్జి ఎస్ఐగా డి.తాహిర్ హుస్సేన్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ అమర్‌నాథరెడ్డి సిక్‌లీవ్‌పై వెళ్లడంతో మైదుకూరు డీఎస్పీ ఆఫీసుకు అటాచ్‌గా పనిచేస్తున్న తాహిర్‌హుస్సేన్‌ను జిల్లా అధికారులు ఇన్‌చార్జిగా ఎస్ఐగా నియమించారు.ఆమేరకు శనివారం కాశినాయన మండల కేంద్రమైన నర్సాపురం పోలీస్‌స్టేషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

కబ్జా చేసిన భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి

బద్వేలు రూరల్, జూలై 13 :గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు కబ్జా చేసిన భూములను రెవెన్యూ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పడిగె వెంకటరమణ, రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేలు అన్నారు. శనివారం భాకరాపేట సమీపంలోని చెన్నంపల్లె గ్రామ పొలానికి సంబంధించి కబ్జాకు గురైన స్థలంలో సీపీఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నంపల్లె గ్రామ పొలం సర్వే నెం.1580, 1809వ 1567 ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు నాటితే బోర్డును సైతం పక్కనపడేసి కబ్జా దారులు ఆక్రమించి రోడ్లు వేసి కంచెలు వేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అయితే రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోలేదన్నారు. వైసీపీ నాయకులు ప్రభుత్వ భూమి



కబ్జాకు గురైన భూములను పరిశీలిస్తున్న నాయకులు

స్వాధీనం చేసుకుని కోట్లాది రూపాయలు గడించారాన్నరు. ఈ కార్యక్రమంలో గోపవరం మండల కార్యదర్శి పెంచలయ్య, మహిళా సంఘం ఏరియా కార్యదర్శి బుజ్జమ్మ, వీహెచ్‌పీఎస్ పట్టణ కార్యదర్శి మురత్నం, చెన్నయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు



బ్రహ్మంగారిమఠం, జూలై 13 : బ్రహ్మంగారిమఠం మండల సర్వసభ్య సమావేశంలో గొడ్లవీడు పంచాయతీలో విద్యుత్‌స్తంభాలు లేవని ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ దృష్టికి టీడీపీ నేత బసిరెడ్డి భాస్కర్‌రెడ్డి తీసుకువెళ్లారు. కాగా సమావేశంలో వెంటనే పుట్టా సుధాకర్‌యాదవ్ విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్‌తో మాట్లాడి గ్రామంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం గొడ్లవీడు గ్రామంలో విద్యుత్ శాఖ సిబ్బంది స్తంభాలను ఏర్పాటు చేసినట్లు మాజీ సర్పంచ్ బసిరెడ్డి జయరామిరెడ్డి, టీడీపీ నేత బసిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. వెంటనే గ్రామంలో సమస్య పరిష్కారం కావడంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలోని సమస్య పరి ష్కారం కావడంతో ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు.

బద్వేలు ఓటమిపై ఎన్డీఏ కూటమి సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలుటౌన్, జూలై 13 : సార్వత్రిక ఎన్నికల్లో బద్వేలులో కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న ఓటమికి గల కారణాలపై శనివారం చెన్నంపల్లెలోని ఆర్ఆర్ కల్యాణమండపంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అధ్యక్షతన టీడీపీ, బీజేపీ జనసేన నాయకులతో నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వాయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బద్వేలు ఓటమికి గల కారణాలు మండల, పంచాయతీల వారీగా అడిగితెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం, మండలం, పంచాయతీని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు సమన్యాయం చేస్తేనే రాబోయే ఎన్నికల్లో బద్వేలులో గెలుపు సులభతరమవుతుందన్నారు. ప్రస్తుతం మన ప్రభుత్వం అధికారంలో ఉందని, నాయకులు సమష్టిగా కృషిచేసి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడేందుకు ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కందుల మురళీమోహన్‌రెడ్డి, జనసేన నాయకులు రమేష్, మిత్తికాయల సునీత, లక్ష్మీదేవి, జహంగీర్‌బాషా, కొంకుల రవి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

చాపాడు, జూలై 13: మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ చాలా అధ్వానంగా ఉంది. మొత్తం 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సుమారు 45 వేల మంది జనాభా ఉన్నారు. అనేక ఏళ్లుగా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ గురించి పట్టించుకునే నాథుడే లేడు. దీంతో అస్తవ్యస్తంగా తయారైంది. వీధుల్లో ఉన్న కాలువల్లో మురుగునీరు నిలబడిపోయింది. చెత్తాచెదారం, కాగితాలు, ఇతర వ్యర్థపదార్థాలు మురుగునీటిలోనే పడి ఉన్నాయి. వాటిని తొలగించే వారు లేరు. దీంతో కంపుకొడుతున్నాయి. దుర్వాసన వెలువడుతుండడంతో గ్రామస్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అన్ని గ్రామాల్లో దోమల బెడద ఎక్కువైంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో మురుగునీరు రోడ్లమీద పారుతోంది. మరికొన్ని గ్రామాల్లో పరిశుభ్రత లోపించింది. కొన్ని గ్రామాల్లో మధ్యలోనే ఎరువు దిబ్బలు వేశారు. చాపాడు, వెదురూరు, టీవోపల్లె, బద్రిపల్లె, పల్లవోలు, ఖాదర్‌పల్లె, చియ్యపాడు, అల్లాడుపల్లె, చిన్నగురవలూరు, రాజువారిపేట, మరికొన్ని గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. రాజుపాళెం, సీతారామపురం, అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె, నాగులపల్లె, అన్నవరం, మడూరు, తదితర గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. దీంతో ఇళ్లలో మురుగునీరు వీధుల్లో పారుతోంది. అనేక ఏళ్ల నుంచి మండలంలో డ్రైనేజీ వ్యవస్థపై ఏ అధికారి కూడా దృష్టి పెట్టలేదు. వర్షాకాలంలో వర్షపునీరు వీధుల్లో పారేటప్పుడు ఇళ్లలోని మురుగునీరు దీంతో కలిసిపోతుంది. ఈ మురుగునీటిలోనే ప్రజలు తిరుగుతుంటారు. కొన్ని గ్రామాల్లో వీధుల్లోని గుంతల్లో మురుగునీరు నిలబడిపోతోంది. కొన్ని నెలల తరబడి మురుగునీరు ఉంటుంది. దీంతో దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతుంటాయి. ఆ మురుగునీటిలోనే గ్రామస్థులు నడుచుకుంటూ వెళుతుంటారు. మురికినీరు ఉండడంతో దోమలు ఎక్కువగా అబివృద్ధి చెందుతుంటాయి. అందువలన గ్రామస్థులకు అసౌకర్యంగా ఉంటుంది. సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రజలు ఇబ్బంది పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడేళ్ల నుంచి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదు. నిధుల కొరతతో గ్రామాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. చాపాడులో ఏర్పాటు చేసిన డ్రైనేజీ కాలువలు కొంతమంది దుకాణాల యజమానులు పూడ్చివేశారు. హోటళ్లు, టీ బంకుల నుంచి వచ్చే మురుగునీరు గ్రామం బయటకు పోయేందుకు అవకాశం లేకుండాపోయింది. అధికారులు ఇప్పటికైనా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.



చాపాడు దళితవాడలో నిలబడి ఉన్న మురుగునీరు



చాపాడులో డ్రైనేజీ కాలువను పూడ్చివేసిన దృశ్యం